
సాక్షి
బాపట్ల
శుక్రవారం । 31 । మార్చి । 2023



దుర్గమ్మ సేవలో జస్టిస్ రవీంద్రబాబు

ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.రవీంద్రబాబు దంపతులు గురువారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 530.00 అడుగుల వద్ద ఉంది. ఇది 168.1460 టీఎంసీలకు సమానంగా ఉంది.

కరోనా @ జీరో

గుంటూరు మెడికల్ : జిల్లా వ్యాప్తంగా గురువారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహర్ (శని)
బాపట్ల	6:26	4:46
గుంటూరు	6:26	4:46
నరసరావుపేట	6:27	4:43

శ్రీరాముడి జీవితం మానవాళికి ఆదర్శం


సీతారాముల కల్యాణంలో ఎస్పీ జిందాల్ దంపతులు



సీతారాముల కల్యాణంలో పాల్గొన్న ఎస్పీ జిందాల్ దంపతులు

ఒంగోలుటౌన్: శ్రీరాముడు ఆచరించిన జీవన విధానం పరిపూర్ణ మానవ జీవితానికి నిలువెత్తు నిదర్శనమని, యావత్ మానవాళికి ఆదర్శనీయమని బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్, ప్రకాశం జిల్లా ఎస్పీ మలికాగర్గ్ దంపతులు అన్నారు. శ్రీరామ నవమిని పురస్కరించుకొని జిల్లా పోలీసు హెడ్క్వార్టర్స్‌లోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో గురువారం జరిగిన స్వామివారి కల్యాణ మహోత్సవంలో ప్రకాశం ఎస్పీ మలికా గర్గ్, బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ దంపతులు పాల్గొన్నారు. స్వామి వార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య మంగళవాయిద్యాలతో మాంగల్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలను నిర్వహించి సీతారాముల కల్యాణాన్ని కమనీయంగా జరిపించారు. ఎస్పీ జిందాల్ మాట్లాడుతూ కరుణ, దయ, నీతి, చిత్తశుద్ధి ప్రేమ, ధర్మం, సత్యాన్ని ఆచరించి ప్రపంచ మానవాళికి ఆదర్శనీయంగా నిలిచిన పురుషోత్తముడు శ్రీరాముడు అని కొనియాడారు. ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ (క్రైమ్) శ్రీధరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఒంగోలు డీఎస్పీ యు.నాగరాజు, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, డీపీఓ ఎం.సులోచన, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ కె.రాఘవేంద్రరావు, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, హరిబాబు, శ్రీకాంత్‌నాయక్, ప్రధానఅర్చకులు ఎం.రమణదీక్షితులు, ఎం.దక్షిణామూర్తి పాల్గొన్నారు.

కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు 1818 క్యూసెక్కులు



తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 1818 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 140 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 144 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 305 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 47 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 0 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 855 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

ప్రత్యేక ఆకర్షణగా 'చేనేతన్న'

జాండ్రపేట రైల్వేస్టేషన్‌కు చేనేత చిహ్నం



చీరాలటౌన్: చీరాల అంటేనే చేనేతల ఖిల్లా. చేనేతలు అధికంగా ఉన్న చీరాలలో నేతన్నలు అగ్గిపెట్టిలో పట్టే అందమైన చీరలు నేసిన చరిత్ర ఉంది. అటువంటి చీరాల చేనేతల ఖ్యాతిని రైల్వే అధికారులు గుర్తించారు. మండలంలోని జాండ్రపేట రైల్వేస్టేషన్‌ను నూతన హంగులతో రైల్వే శాఖ తీర్చిదిద్దింది. రోజుకు పది వరకు రైళ్లు ఈ స్టేషన్లో ఆగుతుంటాయి. జాండ్రపేట రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనుల్లో భాగంగా సుందరంగా తీర్చిదిద్దిన జాండ్రపేట రైల్వేస్టేషన్ ముందు భాగంలో చేనేతలు మగ్గం నేస్తున్న ఫొటో ఏర్పాటు చేశారు. చేనేతలు అధికంగా ఉన్న చీరాల్లోని జాండ్రపేట రైల్వేస్టేషన్‌కు రైల్వే అధికారులు చేనేతల ఫొటోతో స్వాగతం పలికే చిత్రాన్ని ఏర్పాటు చేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.


కోటప్పకొండ హుండీ ఆదాయం రూ.22.59లక్షలు

46 గ్రాముల బంగారం, 169 గ్రాముల వెండి



నరసరావుపేటరూరల్: రాష్ట్రంలోని ప్రముఖ శైవపుణ్యక్షేత్రమైన కోటప్పకొండలో స్వయంభువుగా వెలిసియున్న శ్రీ త్రికోటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం హుండీల లెక్కింపు నిర్వహించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి ఆధ్వర్యంలో దేవదాయ ధర్మదాయశాఖ పరిశీలకులు కె.మంజూష పర్యవేక్షణలో హుండీ లెక్కింపు చేశారు. ఫిబ్రవరి 20వ తేదీ నుంచి గురువారం వరకు 38 రోజులకుగాను ప్రధాన హుండీల ద్వారా రూ.21,49,127, అన్నదానం హుండీ ద్వారా రూ.1,10,625లు కలిపి మొత్తం రూ.22,59,752 వచ్చినట్లు ఈఓ తెలిపారు. గత సంవత్సరం హుండీల ఆదాయంతో పోలిస్తే ప్రస్తుతం సుమారుగా 15 శాతం అదనంగా వచ్చినట్లు తెలిపారు. 46.800 గ్రాముల బంగారం, 169 గ్రాముల వెండి ఆభరణాలు, 40 అమెరికన్ డాలర్లు, రియాద్ ఒక్కటి, మెక్సికో పెసోస్ 100 వచ్చినట్లు తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ యల్లమంద బ్రాంచ్ మేనేజర్ ఏ.ఎస్.ఎన్.రసూల్ బ్యాంక్ సిబ్బంది, కోటప్పకొండ ఔట్ పోస్ట్ పోలీస్ సిబ్బంది, సూపరింటెండెంట్ నాగిరెడ్డి, ఆలయ సిబ్బంది, శ్రీ సద్గురు సేవా సమితి నరసరావుపేట సేవక బృందాలు పాల్గొన్నారు.

దుర్గమ్మకు పుష్పార్చన వైభవం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు గురువారం కనకాంబరాలు, ఎర్రగులాబీలతోపుష్పార్చన వైభవంగా జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద ఉత్సవమూర్తికి ఆలయ అర్చకులు పుష్పార్చన నిర్వహించారు. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఈఓ భ్రమరాంబ, ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. నవరాత్రుల్లో చివరి రోజు కావడంతో పుష్పార్చనను వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

టెన్త్ పరీక్షలకు ఇలా...

- పరీక్ష కేంద్రంలో పాటించాల్సిన నిబంధనలపై ప్రభుత్వ మార్గదర్శకాలు
- విద్యార్థులతోపాటు ఇన్విజిలేటర్లకు వేర్వేరుగా నియమావళి
- ఉమ్మడి జిల్లాలో 368 కేంద్రాల పరిధిలో 69,412 మంది విద్యార్థులు



గుంటూరులో టెన్త్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థినులు

గుంటూరుఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ మూడు నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిసారిగా పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఎన్నో సందేహాలు, ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వ పరీక్షల విభాగం విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలతో కూడిన నియమావళిని హాల్ టికెట్లపై ముద్రించింది. పరీక్ష కేంద్రంలో విద్యార్థులు చేయాల్సిన, చేయకూడని పనులతో పాటు ఇన్విజిలేటర్లకు తమ విధులను నిర్దేశిస్తూ సమగ్ర వివరాలు, నిబంధనలతో కూడిన ఇన్‌స్ట్రక్షన్ మాన్యువల్ విడుదల చేసింది.

పూర్తిస్థాయిలో భద్రతా ఏర్పాట్లు

ఏప్రిల్ మూడు నుంచి 18వ తేదీ వరకు జరగనున్న పరీక్షలకు పగలు, రాత్రీ తేడా లేకుండా శ్రమిస్తున్న విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆశిస్తున్న విద్యార్థుల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పరీక్ష కేంద్రాల్లో పూర్తిస్థాయిలో భద్రతా చర్యలు చేపడుతోంది. విద్యార్థులు హాల్ టికెట్‌తో వచ్చి ప్రశాంతంగా పరీక్ష రాసి వెళ్లేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించడమే ధ్యేయంగా గతంలో ఎన్నడూ లేని రీతిలో విస్తృతమైన ఏర్పాట్లు చేస్తోంది. టెన్త్ పబ్లిక్ పరీక్షలకు మూడు జిల్లాల పరిధిలో ఏర్పాటు చేసిన 368 కేంద్రాల పరిధిలో 69,412 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. విద్యార్థులకు కేటాయించిన పరీక్షా కేంద్రాలను ముందుగానే వారితోపాటు తల్లిదండ్రులు సందర్శించి, పరీక్షలు జరిగే రోజుల్లో సకాలంలో చేరుకునే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలి.

విద్యార్థులు పాటించాల్సినవి...

- హాల్ టికెట్‌లో ముద్రించిన తమ వివరాలు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు, రాయాల్సిన సబ్జెక్టులు, పరీక్ష కేంద్రం పేరు, చిరునామా సరి చూసుకోవాలి. వాటిలో ఏమైనా తప్పులు ఉన్నట్లయితే ముందుగానే తాము చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లి సరి చేయించుకోవాలి.
- ఉదయం 8.30 గంటల కల్లా ఖచ్చితంగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి.
- ఉదయం 8.45 నుంచి 9.30 గంటల వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. 9.30గంటల తర్వాత పరీక్ష కేంద్రం గేట్లు మూసివేస్తారు. ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు.
- పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఇచ్చే క్వశ్చన్ పేపర్‌పై ఏడు అంకెలతో కూడిన ప్రత్యేక కోడ్ ముద్రిస్తోంది. హాల్ టికెట్‌పై ఉన్న ఎన్‌రోల్‌మెంట్ నంబరు ఆధారంగా పరీక్షా కేంద్రంలో రూములను కేటాయించి, దానికి అనుగుణంగానే విద్యార్థులను కూర్చోపెడతారు. బార్ కోడింగ్ విధానంలో రూపొందించిన ఓఎంఆర్ షీట్లను విద్యార్థుల రోల్ నంబరు ఆధారంగా పంపిణీ చేస్తారు.
- రోల్ నంబరు ఆధారంగా విద్యార్థి తనకు కేటాయించిన సీట్లో కూర్చున్న తరువాత ఇన్విజిలేటర్ వచ్చి బార్ కోడింగ్‌తో కూడిన ఓఎంఆర్ షీట్, ప్రశ్నపత్రం, ఆన్సర్ బుక్‌లెట్ అందజేస్తారు. తదుపరి ఓఎంఆర్ షీట్ పూరించే విధానంపై ఇన్విజిలేటర్ ఇచ్చే సూచనలు పాటిస్తూ జాగ్రత్తగా పూరించాలి. దానిపై అనవసరమైన గీతలు, రాతలు రాయరాదు.
- గైర్హాజరైన విద్యార్థుల ఓఎంఆర్ షీట్లను అక్కడే ఉంచి, పరీక్ష ప్రారంభమైన తరువాత ఇన్విజిలేటర్లు వాటిని స్వాధీనం చేసుకుంటారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమైన తరువాత, మధ్యాహ్నం 12.45 గంటలకు పరీక్ష ముగిసే వరకు విద్యార్థులను బయటకు వెళ్లనివ్వరు. గుర్తింపు కార్డు కలిగి, పరీక్షల విధుల్లో ఉన్న అధికారులు, స్క్వాడ్ బృందాలను పరీక్ష కేంద్రాల్లోకి తనిఖీలకు అనుమతిస్తారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసుశాఖ 144 సెక్షన్ అమలు పర్చడంతో పాటు విస్తృత రీతిలో బందోబస్తు ఏర్పాట్లు చేస్తోంది.
- పరీక్ష కేంద్రంలో పక్క, పక్కన కూర్చునే ఏ ఇద్దరు విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రంలో ప్రశ్నలు ఒకే వరుస క్రమంలో ఉండవు. విద్యార్థులు పక్కవారి పేజీలను చూసి సమాధానాలు రాయాలనే ఆలోచన వీడాలి. కాపీయింగ్‌కు పాల్పడినా, జేబులో స్లిప్పులు పెట్టుకుని వచ్చినా, పరీక్ష కేంద్రంలో క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. పరీక్ష రాసే సమయంలో ఏ విద్యార్థి వద్ద అయినా స్లిప్పులు కనిపిస్తే పరీక్షల నుంచి డీబార్ చేస్తారు.

ప్రతి విద్యార్థికి 24 పేజీలతో కూడిన ఆన్సర్ బుక్‌లెట్‌ను ఇచ్చి, అదనంగా పేపర్లు అవసరమైతే మరొక 12 పేజీల బుక్‌లెట్‌ను ఇస్తారు. విద్యార్థులకు ఇచ్చిన ఓఎంఆర్ షీట్, ఆన్సర్ బుక్‌లెట్‌లలో ఏ ఒక్క పేజీని చింపినా మాల్ ప్రాక్టీసుగా పరిగణించే విధంగా కఠినమైన నిబంధనలు అమలు పరుస్తోంది.

ఇవి తీసుకురాకూడదు...

విద్యార్థులు తమ వెంట హాల్ టికెట్, పెన్ను, పెన్సిల్, గ్రాఫ్ గీసేందుకు అవసరమైన సామగ్రి మినహా సెల్‌ఫోన్ సహా ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురాకూడదు.

రైతుకు సేవ.. చేనుకు చేవ

నేడు లాంఫాం శతాబ్ది వేడుకలు

- పరిశోధనలకు పెద్దపీట
- అధిక దిగుబడులకు కృషి



లాంఫాం నూతన భవనం

గుంటూరురూరల్: రైతుల సాధికారత దిశగా కృషిచేస్తున్న లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం ఏర్పాటు జరిగి 100 ఏళ్లు పూర్తయింది. ఈనెల 31వ తేదీన శుక్రవారం శతాబ్ది వేడుకలు నిర్వహించనున్నారు. 1922లో గేదెల పరిశోధన, చిరుధాన్యాల పరిశోధన స్థానంగా ఏర్పాటు జరిగిన లాంఫాం నేడు దినదినాభివృద్ధి చెందింది. శాస్త్రవేత్తలు రైతులకు అవసరమైన నూతన వంగడాలు, తెగుళ్లు, ఎరువులు తదితరాల పరిశోధనలు చేపట్టి పత్తి, మిరప, పెసర, మినుము, కంది, శనగ, జొన్న, సజ్జ, కొర్ర, కొత్తిమీర పంటలలో అధిక దిగుబడులు సాధించే ఎన్నో రకాల వంగడాలను రైతులకు అందించారు. ఎప్పటికప్పుడు రైతుల కోసం సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రిక శక్తి వంటివి రైతులకు అందించటం జరిగింది. కృష్ణ, గోదావరి ప్రధాన కేంద్రంగా 1980లో ప్రాంతీయ పరిశోధన స్థానంగా ఆవిర్భవించింది. వరి, అపరాలు, తెల్లదోమ, గులాబీరంగు పురుగు వంటి కీటకాల నిరోధానికి అపారమైన పరిశోధనలు జరిపి మంచి ఫలితాలు సాధించారు. పత్తిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు మిరపలో యాజమాన్య పద్ధతులు రైతులకు అందిస్తూ వచ్చారు. వరిలో వెద పద్ధతి విధానాన్ని నూతనంగా కనుగొన్నారు. ప్రస్తుతం ఆరు జిల్లాల్లో వివిధ పరిశోధన స్థానాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలు, ఏరువాక కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన వ్యవసాయ విధానాలను ఎప్పటికప్పుడు అందజేస్తున్నారు. పల్నాడు, బాపట్ల, గుంటూరు ప్రకాశం, కృష్ణా జిల్లాల్లో కళాశాలలు, పరిశోధన కేంద్రాలను నిర్వహిస్తున్నారు. శుక్రవారం జరిగే వంద సంవత్సరాల వేడుకల సందర్భంగా రైతులతో శాస్త్రవేత్తలు, మాజీ ఉద్యోగుల ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

మైనార్టీల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృషి

- మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- భట్టిప్రోలు జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపన
- రంజాన్ నెల ప్రార్థనలు ఫలించాలి



భట్టిప్రోలు జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున

భట్టిప్రోలు: రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. భట్టిప్రోలులోని జగనన్న కాలనీలో కో-ఆప్షన్ సభ్యులు షేక్ సలీం ఆధ్వర్యంలో ముస్లింలు మంత్రి నాగార్జున చేతుల మీదుగా 35 మంది లబ్ధిదారుల గృహ నిర్మాణాలకు గురువారం శంకుస్థాపన చేశారు. ముస్లిం మత పెద్దలు షేక్ జిలానీ ప్రార్థనలు చేసి మంత్రిని సన్మానించారు. మంత్రి నాగార్జున మాట్లాడుతూ ముస్లింలు అతి పవిత్రంగా భావించే రంజాన్ నెల కఠోర ఉపవాసాలతో చేసే ప్రార్థనలు ఫలించాలని ఆకాంక్షించారు. దివ్య ఖురాన్ రంజాన్ నెలలోనే ఆవిర్భవించిందని అన్నారు. త్యాగం, క్షమ శిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం విశిష్టత తెలుపుతుందని అన్నారు. రంజాన్ నెల ప్రారంభమైన సందర్భంగా ముందస్తుగా శుభాకాంక్షలు తెలిపారు. స్థలాలు కేటాయించడంతోపాటు నిధులు సమకూర్చడంపై ముస్లిం మహిళలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. గృహాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గృహ నిర్మాణాలపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. సర్పంచ్ దారా రవి కిరణ్మయి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, ఉప సర్పంచ్ బూర్లె రామప్రసాద్, పంచాయతీ వార్డు సభ్యులు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

మింగేసిన మృత్యువు

నదిలో మునిగి ఇద్దరు విద్యార్థులు మృతి



కేశర రాజశేఖరరెడ్డి, కొల్లి మల్లికార్జురెడ్డి మృతదేహాలు

అమరావతి: ఇంటర్ పరీక్షలు రాసి ఇంటికి వచ్చిన పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరుకు చెందిన ఇద్దరు విద్యార్థులు అమరావతిలోని కృష్ణానదిలో మునిగి మృతి చెందారు పోలీసులు అందించిన సమాచారం ప్రకారం పెదకూరపాడు మండలం 75త్యాళ్లూరుకు చెందిన కేశర రాజశేఖరరెడ్డి, కొల్లి మల్లికార్జురెడ్డి, కేశర నాగనితిన్‌రెడ్డి, మున్నంగి కార్తీక్‌రెడ్డిలు గుంటూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాసి మంగళవారం ఇంటికి వచ్చారు. గురువారం గ్రామంలో జరిగిన శ్రీరామనవమి వేడుకలలో పాల్గొని సుమారు 3 గంటల సమయంలో సెల్‌ఫోన్ రిపేరు నిమిత్తం నలుగురు అమరావతి వచ్చారు. తొలుత కృష్ణానదిలో స్నానం చేద్దామనే ఉద్దేశంతో అమరేశ్వరఘాట్ వద్ద ఇసుకరీచ్ సమీపానికి చేరుకున్నారు. ఈక్రమంలో కేశర రాజశేఖరరెడ్డి(17), కొల్లి మల్లికార్జురెడ్డి అలియాస్ భార్గవ్(17)లు ఇద్దరు స్నానానికని నదిలోకి దిగారు. వీరిద్దరు ప్రమాదవశాత్తు నదిలో లోతుకి వెళ్లి మునిగిపోతుండటంతో ఒడ్డు మీద ఉన్న ఇద్దరు స్నేహితులు రక్షించమని కేకలు వేశారు. రక్షించటానికి స్థానికులు వచ్చేలోపే ఇద్దరు నీటిలో మునిగిపోయారు. ఈక్రమంలో పోలీసులకు సమాచారం అందించటంలో గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టగా ప్రమాదం జరిగిన ప్రదేశానికి ఇరవై అడుగుల దూరంలో రెండు మృతదేహాలను వెలికితీశారు. మృతుడు రాజశేఖరెడ్డి తండ్రి అక్కిరెడ్డి పదేళ్ల కిందట మరణించాడు. తల్లి భాగ్యలక్ష్మి రెక్కల కష్టంతోనే డిగ్రీ చదువుతున్న పెద్దకొడుకు అంజిరెడ్డిని, మృతుడు రాజశేఖరెడ్డిని పోషిస్తుంది. పెద్దచదువులు చదవాల్సిన కొడుకు పండగ పూట మరణించాడని రాజశేఖరరెడ్డి తల్లి భాగ్యలక్ష్మి కన్నీరుమున్నీరవటం స్థానికుల మనసులను కలచి వేసింది. నిత్యం ఆడుతూ పాడుతూ తిరిగే తమ కొడుకు మల్లికార్జునరెడ్డి అలియాస్ భార్గవరెడ్డి విగతజీవిగా పడిఉండటం చూసి రామలింగారెడ్డి దంపతులు బోరున విలపించడం అందరిని కంటతడి పెట్టించింది. భార్గవరెడ్డి సోదరుడు కోదండరామిరెడ్డి త్యాళ్లూరు జెడ్పీ హైస్కూల్లో 9వతరగతి చదువుతున్నాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటరుకు తరలించారు. అమరావతి పోలీసులు సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పదో తరగతిలో టాపర్స్....

75త్యాళ్ళూరు జెడ్పీ పాఠశాల నందు విద్యాను అభ్యసించిన మల్లికార్జునరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పదో తరగతిలో పాఠశాల టాపర్లుగా నిలిచారు.

మహిళాభ్యుదయమే జగనన్న లక్ష్యం

- ప్రతి సంక్షేమ పథకంలోనూ తొలి ప్రాధాన్యం
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- వేడుకగా ఆసరా చెక్కుల పంపిణీ



ద్వాక్రా సంఘాల మహిళలకు చెక్కు అందజేస్తున్న మంత్రి విడదల రజిని

యడ్లపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని..ప్రతి పథకంలో అక్కచెల్లెమ్మలకు ప్రాధాన్యత కల్పించడంలో ఉద్దేశం అదేనంటూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని అన్నారు. యడ్లపాడు మండలం టీటీడీ కల్యాణ మండపంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. మంత్రి రజినిపై మహిళలు పూలవర్షం కురిపిస్తూ అపూర్వ స్వాగతం పలికారు. ముందుగా డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జాతీయగీతం, ద్వాక్రా మహిళల ప్రార్థనగీతాలను ఆలపించారు. మంత్రితోపాటు అధికారులు, ప్రజాప్రతినిధులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏపీఎం ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించగా, ఎంపీడీవో వై హనుమారెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. మంత్రి రజిని మాట్లాడుతూ జగనన్న సుదీర్ఘ పాదయాత్రలో మహిళల కష్టాలు తెలుసుకొని, వారిని రుణ విముక్తులను చేస్తానంటూ నాడు ఇచ్చిన వాగ్దానం మేరకు ముఖ్యమంత్రిగా వైఎస్సార్ ఆసరా కార్యక్రమం ప్రవేశపెట్టి వారి రుణాలన్నీ నాలుగు దశలుగా తీర్చే బృహత్తర బాధ్యత తనపై వేసుకున్నారని తెలిపారు. వైఎస్సార్ ఆసరా నిధులతో మహిళల అప్పులు తీర్చుకుంటూ, వివిధ ఉపాధి పనులు ఏర్పాటు చేసుకుంటూ తమ కుటుంబాలను ఆర్థిక అభ్యున్నతి జరిగేలా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వంలో అమలయ్యే ప్రతి పథకం మహిళల సాధికారికతను సాధించేలా ఉంటాయని అదే జగనన్న ఆశయం అన్నారు. యడ్లపాడు మండలానికి ఆసరా మూడోవిడత నిధులు రూ.36 కోట్ల లబ్ది చేకూరిందన్నారు.

చెక్కులు అందజేత

వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో మూడో విడత వైఎస్సార్ ఆసరా కింద 10,356 మంది సభ్యులకు రూ.8,48,71,925 చెక్కు, స్త్రీనిధి కింద 1074 మంది సభ్యులకు రూ.5,40,00,000, ఉన్నతి పథకం కింద 291 మంది సభ్యులకు రూ.1,44,00,000 చెక్కుల్ని మహిళా సంఘాలకు అందజేశారు. 14 మందికి జీవనోపాధి కింద కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. మహిళలు, ప్రజాప్రతినిధులు, మంత్రి రజినిని సత్కరించగా, ఎంపీపీ ఝాన్సీ, మహిళా సంఘాల నాయకులను మంత్రి సత్కరించారు. అనంతరం మహిళలతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. డీఆర్‌డీఏ పీడీ బాలు నాయక్, ఎంపీపీ పిడతల ఝాన్సీ, వ్యవసాయ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వైస్ చైర్మన్ ఎం వీరారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రాచమంటి చింతారావు, నాయకులు గంటా శంకర్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షురాలు పి సువర్ణకుమారి, ఏపీఎం జీవన్, సర్పంచ్ కె హేమ, పి బుల్లెబ్బాయ్, మాదం శ్రీను, సుబ్బారావు, లక్ష్మీనారాయణ, పి వాసు, ప్రసన్న, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీతారాములకు పీఆర్కే ముత్యాల తలంబ్రాలు సమర్పణ



కోదండరామాలయంలో పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ పీఆర్కే, రమాదేవి దంపతులు

మాచర్ల: పట్టణంలోని కోదండ రామాలయంలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే), ఆయన సతీమణి రమాదేవి పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. సీతారాముల కల్యాణ మహోత్సవానికి ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అనంతరం కల్యాణ మహోత్సవంలో పాలుపంచుకుని స్వామి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, పోలా శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసశర్మ, చిల్లంచర్ల సత్యనారాయణ, ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు మారం ప్రసాద్, పోలిశెట్టి పిచ్చయ్య, అధ్యక్షులు విడేల సుందరరావు, ఉపాధ్యక్షులు పోలిశెట్టి కృష్ణమూర్తి, విడేల గోపాలకృష్ణమూర్తి, చీదెళ్ళ వెంకట నారాయణ, ఊటుకూరి పోలయ్య, గోళ్ళ వెంకట జనార్దనరావు, భవనారి లోక్‌నాథ్ కోటేశ్వరరావు పాల్గొన్నారు. పలువురు భక్తులు స్వామికి బంగారు ఆభరణాలు అందజేశారు. ఓబులశెట్టి లక్ష్మీనారాయణ దంపతులు కల్యాణాన్ని జరిపించారు.

యువకుడు ఆత్మహత్య

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేశారు. సాయిరాం థియేటర్ ప్రాంతానికి చెందిన అంబటి శేషకుమారి, లాజరిసీ భార్యభర్తలు. వీరికి ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడైన సోమశేఖర్ మద్యానికి బానిసై బుధవారం రాత్రి తల్లిని డబ్బులు కావాలని అడగడంతో వాదన జరిగింది. దీంతో అతను ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

భక్తితో మానసిక ప్రశాంతత

మంత్రి మేరుగ నాగార్జున



బొద్దులూరుపాడులో శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న మంత్రి మేరుగ నాగార్జున

కొల్లూరు : భక్తితో మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున చెప్పారు. శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా గురువారం మండలంలోని బొద్దులూరు పాడులో నిర్వహించిన పూజా కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సర్వమత సౌభ్రాతృత్వంతో ప్రశాంత జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. యువత సంస్కృతి, సంప్రదాయాలకు విలువివ్వాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో అన్ని మతాలు కలిసి కట్టుగా పండగలు జరుపుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు. తొలుత ఆయన స్థానిక రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచి గుర్రం మురళి, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు సూర్యదేవర రామకృష్ణ, నూతలపాటి వెంకటేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వరరావు, పట్టపు వెంకటేశ్వర్లు, పిచ్చయ్య, కొలుసు శ్రీనివాసరావు, అయిల సుబ్బారావు, ఉప్పు శ్రీనివాసరావు, ఈమని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మతత్వంలో మానవసేవ పరాయణత్వం



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, కమలానంద భారతీస్వామి తదితరులు

బాపట్ల అర్బన్: అమ్మతత్వంలో మానవ సేవ పరాయణత్వం ఉందని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ చెప్పారు. జిల్లెళ్లమూడి గ్రామంలో అమ్మ శత జయంత్యుత్సవాల్లో భాగంగా మూడో రోజు గురువారం జరిగిన సభలో కొండముది సుబ్బారావు రచించిన 'అమ్మచే ప్రభావితులు' అనే గ్రంథాన్ని, గన్నవరం భువనేశ్వరి పీఠాధిపతులు కమలానంద భారతి మహాస్వామి, రావూరి ప్రసాద్ సేకరణలో వెలువడిన 'అమ్మతో అనుభవాలు' -6,7,8 సంపుటాలను ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మను ప్రత్యక్షంగా దర్శించుకునే అవకాశం కలగడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. భువనేశ్వరి పీఠం పీఠాధిపతులు కమలానంద భారతి స్వామి అనుగ్రహ భాషణం చేస్తూ లక్ష మందికి అన్నం పెట్టిన అమ్మ ఆదిపరాశక్తి అవతారమన్నారు. రామాయణంలో మనకు కనిపించే శబరి ఈ యుగంలో జిల్లెళ్లమూడి అమ్మగా వచ్చి బిడ్డలకు గోరుముద్దలను తినిపించిందని అభివర్ణించారు. కార్యక్రమానికి విశ్వజనని పరిషత్ టెంపుల్స్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ మరకని దినకర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు దర్శనపు శ్రీనివాస్, రావూరి ప్రసాద్, గౌతమీ విద్యాపీఠ విశ్రాంత సంస్కృత ఉపన్యాసకులు కందుకూరి సత్యసూర్యనారాయణ, అమ్మతత్వ ప్రచార కమిటీ సభ్యురాలు ఉప్పల వరలక్ష్మి రస రమ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథులను విశ్వ జనని పరిషత్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి, అమ్మ జ్ఞాపికను బహూకరించి ప్రసాదాన్ని అందించారు.

రోడ్డు ప్రమాదంలో హోమియో డాక్టర్ దుర్మరణం

మరొకరికి తీవ్ర గాయాలు



హోమియోపతి డాక్టర్ రాకేష్ మృతదేహం

తాడేపల్లిరూరల్: మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థల పరిధిలోని ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి గురువారం అప్పారావు చెక్ పోస్ట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ హోమియో డాక్టర్ మృతి చెందగా, డాక్టర్ సహాయకుడికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా హుజూరాబాద్ మండలం, కందుకుల గ్రామానికి చెందిన తలకుక్కల రాకేష్ (26) తుళ్లూరు మండలం, వెంకటపాలెంలో ఉన్న మంతెనసత్యనారాయణ రాజు ఆశ్రమంలో హోమియోపతి డాక్టర్‌గా పనిచేస్తున్నారు. శ్రీరామనవమి సందర్భంగా హోమియోపతి క్లినిక్‌కు సెలవు కావడంతో తన అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గణేష్‌ను తీసుకుని ద్విచక్ర వాహనంపై విజయవాడ సినిమాకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఉండవల్లి సెంటర్‌కు వచ్చి అల్పాహారం తీసుకుని కొండవీటి వాగు మీదుగా అమరావతి కరకట్ట వద్దకు వచ్చారు. ఈ నేపథ్యంలో వెంకటపాలెం నుంచి వస్తున్న కారు అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న గణేష్ హెల్మెట్ ధరించడం వల్ల స్వల్ప గాయాలు అయ్యాయి. వెనుక కూర్చుని వున్న హోమియోపతి డాక్టర్ రాకేష్ బండిమీద నుంచి ఎగిరి కింద పడటంతో తలకు తీవ్ర గాయమైంది. గాయపడిన రాకేష్‌ను అప్పారావు చెక్ పోస్ట్ వద్ద ఉన్న పోలీసులు 108 వాహనం ద్వారా విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే రాకేష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ సంఘటనపై డాక్టర్ రాకేష్ అసిస్టెంట్ గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

● 15 కిలోల గంజాయి స్వాధీనం ● పరారీలో మరో నిందితుడు



డీఎస్పీ స్రవంతిరాయ్, పక్కన సీఐ వెంకటరావు, ఎస్ఐ శివరామయ్య

తెనాలిరూరల్: అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నుంచి గంజాయి తీసుకువచ్చి స్థానికంగా విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో గంజాయిని స్వాధీనపర్చుకున్నారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కె.స్రవంతిరాయ్ వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం నందులపేటలో నివసిస్తున్న తెనాలి మండలం కొలకలూరుకు చెందిన ఐలా శ్రీనివాస్ గతంలో గంజాయి, చోరీ, హత్యాయత్నం కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. నర్సీపట్నానికి చెందిన విష్ణు ద్వారా గంజాయి తెనాలికి తీసుకువచ్చి చిన్న పొట్లాలుగా కట్టి విక్రయాలు సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి ఐతానగర్ ప్యాడిసన్‌పేటలోని కమ్యూనిటీ హాలు వద్ద మరో ఐదుగురితో కలసి గంజాయిని విక్రయిస్తుండగా టూటౌన్ ఎస్ఐ బి.శివరామయ్యకు సమాచారం అందింది. ఎస్ఐ తన సిబ్బందితో కలసి ఘటనాస్థలానికి వెళ్లి ప్రధాన నిందితుడు ఐలా శ్రీనివాస్‌తో పాటు నందులపేటకు చెందిన దేవరకొండ మను శివశంకర్, ఐతానగర్‌కు చెందిన తాడికొండ చంద్రశేఖర్, తాతపూడి సునీల్, పల్లె సంజయ్, వల్లభాపురపు సునీల్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి సుమారు 15 కిలోల గంజాయిని స్వాధీనపర్చుకున్నారు. గంజాయిని సీజ్ చేసి నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు డీఎస్పీ తెలిపారు. మరో నిందితుడు కాటరాజ్ పరారీలో ఉన్నాడని చెప్పారు. సమావేశంలో టూటౌన్ సీఐ ఎస్.వెంకటరావు, ఎస్ఐ శివరామయ్య, హెడ్‌కానిస్టేబుల్ బి.నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో భార్యను చంపిన భర్త




లక్ష్మి మృతదేహం

ఎ.కొండూరు(తిరువూరు): కుటుంబ కలహాలతో భార్యను భర్త అతి కిరాతకంగా నరికి చంపాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపాలపురం గ్రామానికి చెందిన ఎం. లక్ష్మితో అదే గ్రామానికి చెందిన కోటేశ్వరరావుకు 23 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. కుమార్తె, ఒక కుమారుడికి వివాహం చేశారు. మరొక కుమారుడు తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. కుటుంబ కలహాలతో భార్యభర్తలు గత కొన్ని రోజులుగా గొడవలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి భర్త కోటేశ్వరరావు మద్యం సేవించి భార్యతో గొడవపడి గొడ్డలితో అతిదారుణంగా నరికాడు. లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి శవ పంచనామా అనంతరం తిరువూరు ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆర్.అంకారావు తెలిపారు.

పాఠశాలల్లో వ్యవసాయ పాఠాలు

- విద్యార్థులకు రైతన్నల కష్టం తెలిసేలా..
- సేంద్రియ పంట ఉత్పత్తిపై అవగాహన
- మొక్కలు నాటించి సంరక్షణ బాధ్యతలు అప్పగింత
- ఎకో క్లబ్‌లతో చైతన్యం నింపే ప్రయత్నం

రోజులు మారాయి.. కెరీర్ ఓరియెంటెడ్ చదువులు.. పట్టణ జీవనం నిత్యం ఉరుకులు పరుగులు.. చిన్నారులకు గ్రామాలతో పరిచయం తగ్గిపోవడం.. వంటి సమస్యలతో వ్యవసాయానికి దూరమవుతున్నారు.. చాలా మంది మన ప్రాంతంలో పండే పంటలు కూడా గుర్తించలేకపోతున్నారు.. ఈ నేపథ్యంలో కొన్ని విద్యాసంస్థలు ప్రాథమిక స్థాయిలోనే సేద్యంపై చైతన్యం తీసుకొచ్చేందుకు శ్రీకారం చుట్టాయి. అందులో భాగంగా పాఠశాల ఆవరణలో ఆకు కూరలు సాగుచేస్తూ చిన్నారులను భాగస్వాములను చేస్తున్నారు..



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరంలోని వివిధ విద్యాసంస్థలు తమ పాఠశాలల ప్రాంగణాన్ని వ్యవసాయ క్షేత్రంగా మార్చి విద్యార్థులతో మొక్కలు నాటించి, వాటిని సంరక్షించే బాధ్యతలను అప్పగిస్తున్నారు. గుంటూరు నగరంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో కిచెన్ గార్డెన్‌ను నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఆడుకునేందుకు అందుబాటులో ఉన్న ఖాళీ స్థలంలో విత్తనాలు చల్లి, మొలకెత్తిన మొక్కలను సంరక్షించడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందిస్తూనే వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరల సాగు చేపడుతున్నారు. ఆహార ఉత్పత్తికి రైతులు పడే కష్టం, శ్రమను విద్యార్థులకు తెలియజేయడంతో పాటు ప్రత్యక్షంగా వారితోనే పంటల సాగు చేయిస్తున్నారు. టమోటా, కాకర, వంకాయ, పచ్చిమిర్చి, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, చిక్కుడు, ఆకుకూరలను పండిస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయం..

వ్యవసాయ ఆధునికీకరణలో భాగంగా అధునాతన యంత్రాలతో పాటు అధిగ దిగుబడి సాధించేందుకు రసాయనాలు వినియోగిస్తున్నారు. అయితే వాటి దుష్ప్రభావాలు భూమిపై విపరీత ప్రభావాన్ని చూపడంతో పాటు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పించడంతో పాటు రైతు శ్రమ విలువను చాటి చెప్పేందుకు కృషి చేస్తున్నారు. విద్యార్థులతో సేంద్రీయ ఎరువులు, గోకృపామృతం, దశపర్ణీ వంటి క్రిమి సంహారకాలను వినియోగించి, పర్యావరణ హితమైన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు.

ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం



ప్రజలందరికీ ఆహారాన్ని అందించే రైతులను ఎంతో గౌరవంగా చూడాలనే నినాదాన్ని ప్రాథమిక స్థాయి నుంచే చైతన్యం కలిగిస్తున్నాం. పాఠశాలలో వ్యవసాయ క్షేత్రాన్ని నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు వారి చదువులో భాగంగా విత్తనాలు చల్లి మొక్కలు పెంచడం, వాటిని సంరక్షించడంలో భాగస్వాములను చేస్తున్నాం.

–పాటిబండ్ల విష్ణువర్ధన్, కరస్పాండెంట్, ఎస్పీఎస్ సీబీఎస్ఈ స్కూల్

చదువులో అంతర్భాగంగా సాగుబడి



చదువులో అంతర్భాగంగా విద్యార్థులతో సాగుబడి చేయిస్తున్నాం. రసాయనాలతో పని లేకుండా వివిధ రకాల ఉత్పత్తులను ఉపయోగించి, పాఠశాలలోనే సహజమైన ఎరువులను తయారు చేయించి వాటిని వినియోగిస్తున్నాం. పాఠశాలలో పండిన పంటలను ఉపాధ్యాయులు నేరుగా వారి ఇళ్లకు తీసుకెళ్లి కూరల్లో వాడుతున్నారు. నర్సరీ మొదలు అన్ని తరగతుల విద్యార్థులతో ఫార్మింగ్ చేయిస్తున్నాం.

కె.పార్వతీదేవి, ఉపాధ్యాయురాలు

అందరం భాగస్వాములం..



చదువుతో పాటు పాఠశాల ఆవరణలో మొక్కల పెంపకంలో విద్యార్థులందరు భాగస్వాములవుతున్నాం. పాఠశాల ప్రాంగణంలో పూల మొక్కలతో పాటు తరగతి గదుల వెనుక ఉన్న స్థలంలో మా చేతులతో చల్లిన విత్తనాలు మొలకొత్తడం చూశాం. మొక్కలకు ప్రతి రోజూ నీరు పోసి వాటిని చక్కగా సంరక్షిస్తున్నాం.

పి.మోహనలక్ష్మీప్రియ, 9వ తరగతి విద్యార్థిని

పండగ పూట విషాదం

- వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం
- ఒకరు పేరాల వాసి, మరొకరు వాడరేవు యువకుడు



గరికిన సాగర్ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి, కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్) సాగర్ (ఫైల్)



మృతిచెందిన సుబ్బారావు (ఇన్‌సెట్) వడ్లమూడి సుబ్బారావు (ఫైల్)

చీరాల: శ్రీరామనవమి రోజున రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. వీరిలో ఒకరు పేరాల వాసి కాగా, మరొకరు వాడరేవు యువకుడు. పోలీసుల కథనం ప్రకారం.. పేరాల హరిప్రసాద్‌నగర్ పోలేరమ్మ గుడి సమీపంలో నివసించే వడ్లమూడి సుబ్బారావు(49) పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో సీనియర్ కాంపౌండర్. అతను బుధవారం రాత్రి అత్తగారి ఊరు గవినివారిపాలెం వెళ్లి ద్విచక్రవాహనంపై పేరాల వస్తుండగా గవినివారిపాలెం -పిట్టువారిపాలెం గ్రామాల మధ్యలోని చప్టా సమీపానికి వచ్చేసరికి ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం సుబ్బారావును ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన సుబ్బారావు ఘటన స్థలంలోనే మృతిచెందాడు. తెల్లవారుజామున పొలాలకు నీరుపెట్టేందుకు వచ్చిన రైతులు సుబ్బారావును చూసి గవినివారిపాలెంలోని అతని అత్త కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పట్టణంలో పేరొందిన సీనియర్ కాంపౌండర్ సుబ్బారావు మృతితో పేరాల హరిప్రసాద్‌నగర్‌లో విషాదం అలముకుంది.

పరీక్షలైన మరునాడే.. మృత్యుఒడికి..

వాడరేవుకు చెందిన గరికిన సాగర్(19) బుధవారం సీనియర్ ఇంటర్ ఆఖరి పరీక్ష రాశాడు. గురువారం ఉదయం తన వాహనానికి సర్వీసింగ్ చేయించుకుని వస్తానని తల్లికి చెప్పి ఇంటి నుంచి బయటకొచ్చాడు. ఐదు నిమిషాల్లోనే వాడరేవు రోడ్డులోని పెట్రోల్ బంకు సమీపంలో ట్రాక్టర్ ఢీకొట్టడంతో దుర్మరణంపాలయ్యాడు. సాగర్ తండ్రి సముద్రంలో చేపల వేట చేస్తుండగా.. తల్లి చేపల అమ్మకాలు చేస్తూ సాగర్, అతని చెల్లిని చదివిస్తున్నారు. 'అమ్మా ఇంటర్మీడియెట్ పరీక్షలను బాగా రాశాను. ఇంకా బాగా చదివి నిన్ను, నాన్నను మంచిగా చూసుకుంటా. చెల్లికి పెళ్లి చేస్తాను' అని చెప్పిన కొడుకు అంతలోనే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. దుర్ఘటనపై కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు సాగర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అయ్యో'పాప'ం.. తీరని శోకం

వేడి నీటి బకెట్లో పడిన చిన్నారి చికిత్స పొందుతూ మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వేడి వేడి నీళ్ల రెండు చుక్కలు ఒంటిపై పడితేనే తట్టుకోలేం.. అలాంటిది వేడినీటి బకెట్లోనే పడిన ఆ పసికందు ఎంత బాధను అనుభవించిందో! తలచుకుంటేనే మనసు వేదన చెందుతుంది. ముఖం నుంచి నడుం వరకూ అంతా వేడి నీటికి కాలిపోయినా మృత్యువుతో ఆ బిడ్డ చేసిన పోరాటం చివరకు విషాదాంతమే అయ్యింది. బోసి నవ్వులు, బుడి బుడి అడుగులు ఇక కనపడవన్న విషయం తెలిసిన కన్నవారికి కన్నీటి రోదనే మిగిలింది. కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రమాదవశాత్తు వేడి నీటి బకెట్‌లో పడిన చిన్నారి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

స్నానానికని నీళ్లు పెట్టగా..

లంబాడీపేటకు చెందిన ఆదిమల్ల ప్రణీతి, ప్రేమ్‌కుమార్‌లు భార్యభర్తలు. వీరికి పాప(8 నెలలు) సంతానం. ప్రేమ్‌కుమార్ సెంట్రింగ్ పని చేస్తుండగా, ప్రణీతి ఇంట్లోనే ఉంటుంది. ఈ నెల 27వ తేదీన భర్త ప్రేమ్‌కుమార్ పనికి వెళ్లగా, పాపకు స్నానం చేయించేందుకు ప్లాస్టిక్ బకెట్‌లో ఎలక్ట్రికల్ హీటర్ పెట్టి బాత్ రూమ్‌లోకి వెళ్లింది. ఇంతలో గదిలో నుంచి పాప ఏడుపు వినిపించడంతో కంగారు వచ్చి చూసింది. పాప వేడినీటి బకెట్‌లో తల కిందులుగా పడి ఉండటంతో భయంతో కేకలు వేసింది. పాపను వేడినీటిలో నుంచి బయటకు తీయగా ముఖం, రెండు చేతులు, పొట్ట భాగం, వీపు, కాలి భాగం కాలిపోవడంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రభుత్వాస్పత్రిలో పాప చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. దీంతో ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.